# భోధయ జ్ఞాయ నమః

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి దివ్య బోధలు



రచన : పెసల సుబ్బరామయ్య

వెల ఒక్క రూపాయి

బోధయజ్ఞాయ నమః

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి

దివ్యబోధలు.

ఏ రూపమూ, ఏ నామమూ లేని ఆ పరమాత్మకు అన్ని రూపాలూ, అన్ని నామాలూ వారివే. అట్టి అనంతనామములలో బోధయజ్ఞాయ అనేది కూడ ఒక పేరు. నిరంతరమూ జీవులకు బోధ చేయువాడు అని అర్థము. నిరంతరమూ వారు బోధిస్తున్నా మనమూ బోధను గ్రహించి నడుచుకునే స్థితిలో లేము. అందుకై వారు మనమీద ఎంతో కరుణతో తిరిగి స్వప్నాల ద్వారా మనలను మన ప్రవర్తన మార్చుకోమని సామ, దాన, భేద, దండోపాయముల ద్వారా సరిచేయ చూస్తున్నారు.

ఇంతవరకూ అవతరించిన మహాత్ములందరూ సందర్భ వశాత్తు ఆయా భక్తులతో చెప్పిన మాటలనే వారి సూక్తులుగా గ్రంధకర్తలు వ్రాస్తూ

వచ్చారు. కానీ భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు 1. సత్యం, 2. ధర్మం, 3. సంపన్నత్వం, 4. సాధారణత్వం, 5. సద్గురు సేవ అనే ఐదు లక్షణాలను మానవాళికి ఎలుగెత్తి చాటారు. చివరి రోజులలో ఒక్కొక్క లక్షణాన్ని కొన్నిరోజులపాటు రాత్రింబవళ్ళు అన్నపానీయాలు మాని పెద్దగా అరుస్తూ అదే మాటను తన సేవకులనుకూడా పెద్దగా అరిచి చెప్పమనే వారు. వారు నిద్రతో తూగి చెప్పకుంటే " ఏమయ్యా చెప్పవు?"- అని అడిగేవారు. అలా ఎలుగెత్తి అరిచి తన చివరి సందేశం మానవాళికి వినిపించారు.

అంతటితో ఆగక మహాసమాధి అనంతరం కూడా సత్యం, ధర్మం తప్పిన వారిని స్వప్నాల ద్వారా సత్యం, ధర్మం తప్పినావని హెచ్చరిస్తూ వారి ప్రవర్తనలోని లోపాలను సరిచేస్తున్నారు.

అందరికీ అలా స్వప్నాల ద్వారా చెప్పరేమని మీరడుగ వచ్చు. మన లెఖ్ఖలో పుణ్యం కంటే పాపమే ఎక్కువ గనుక వారు స్వప్నాల ద్వారా బోధించినా మనకు



స్వప్నానంతరం గుర్తే ఉండదు. కనుక శ్రీ స్వామివారి సేవ, పారాయణముల ద్వారా మనం పుణ్యం పెంచు కుంటే వారి బోధ వినగల్గుతాము. "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో అయ్యా" - అని శ్రీ స్వామివారు చెప్పారు. మనం ఎంతవరకు స్వార్ధంవీడి అన్ని జీవులలోనూ వారిని చూచే ప్రయత్నం చేస్తామో అంత మేరకు మన పుణ్యం పెరిగి వారి బోధను ఆచరించ గల్గుతాము.

శ్రీ డి. నాగేశ్వరరావు గారు ఇలా వ్రాస్తున్నారు.

అది ఏప్రియల్ 5వ తేది, 2002 సంవత్సరము. రాత్రి స్వప్నములో శ్రీ స్వామివారు మమ్ములను -అనగా దమ్మపేట సత్సంగ సభ్యులను- మాకు దగ్గరలో గల మందలపల్లి గ్రామములో ఉన్న శిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణము లోనికి తీసుకొని వెళ్లినారు. ఆ ప్రాంగణమంతా నాపరాయి పరుచబడి చాలా విశాలంగా ఉన్నది. మమ్ములను, మందలపల్లి సత్సంగ సభ్యులను అందరినీ డ్రిల్ కొరకు డ్రిల్‌సార్ నిలబెట్టి నట్లుగా దూరదూరంగా క్రమశిక్షణగా

నిలబెట్టినారు. ఎదురుగా శ్రీ భరద్వాజ గురువుగారు ఒకవైపు, శ్రీ వెంకయ్యస్వామివారు ఒకవైపు నిలబడి ఉన్నారు. వారు ఇద్దరూ - పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలు అనే విషయాలను గురించి ఏమిటో చెప్పుచున్నారు. నాకు ఏమియూ బోధపడుటలేదు. అలా వరుసగా 5వ తేది రాత్రి, 6వ తేది రాత్రి స్వప్నంలో కనబడటం అలా చెప్పుకుంటూ పోవడం జరిగింది. కానీ నా అజ్ఞానంకొద్దో లేక కర్మ బాగా బలీయంగా ఉండుటవలననో తెలియదుగాని, నాకు ఏమియూ బోధపడలేదు. మూడవరోజు గురువు గారి వద్ద నా ఆవేదనను తెలియజేస్తూ ఏమైనా చెప్పాలంటే స్పష్టంగా తెలుపండి, నాకు ఏమియూ బోధపడుటలేదు - అని కన్నీటితో చెప్పుకొని పడుకున్నాను.

7వతేది రాత్రి మరలా అదేమాదిరిగా స్వప్నం - ఒకవైపు గురువుగారు, మరియొక వైపు శ్రీ వెంకయ్యస్వామి వారు ఉన్నారు. సత్సంగ సభ్యులందరిని మోకాళ్ళ మీద నిలువబెట్టి శ్రీ వెంకయ్యస్వామివారు ఉరిమి కళ్ళు ఎఱ్ఱగ పెద్దవి చేసి



- "అనుకున్నవి చెయ్యక పోతే శిక్షలు కఠోరంగా ఉంటాయి" - అని పదే పదే బోధించారు. తరువాత కొద్దిసేపటికి స్వప్నం ముగిసింది. తెల్లవారిన వెంటనే నాకై నేను చేసిన రెండు దోషాలు నాకు తెలియ వచ్చినవి-

1. ఏ రోజైనా దమ్మపేట గ్రామంలో నిద్రచేసి ఉంటే ఆరోజు తప్పక ఉదయం గం. 5-15 ని. లకు ప్రార్థన చేసి వెళ్ళడం నా అలవాటు. కాని ఆ వారంలో ఒక రోజు ఉదయం గం. 5-10 ని. లవరకు ఉండికూడా ప్రార్థన చెప్పకుండా నా వ్యక్తిగత తొందరలో వెళ్ళిపోవడం జరిగింది.

2. గురుచరిత్ర మొత్తం ఒక గేయంగా వ్రాసి ఉన్నారు. దాన్ని నిత్యం పారాయణం చేస్తానని చెప్పుకొని యున్నాను. కాని మార్నింగ్ స్కూలు అయినందున గేయం చదవకుండానే స్కూలుకు వెళ్ళుతున్నాను.

పై రెండు విషయాలు నేను చేస్తానని అనుకొని చేయకుండా మానివేసిన దానినే శ్రీ స్వామివారు అలా పలికారు.

ఈ లీల ద్వారా శ్రీ స్వామివారు మానవాళికి ఎంతో గొప్ప సత్యాలు బోధిస్తున్నారు-

1. నేను పై విషయాలు చెప్పుకున్నప్పుడు శ్రీ స్వామివారు భౌతికంగా మన ఎదుట లేరు. కానీ మన ప్రతిమాట, ఆలోచన, పనిని గుర్తిస్తూనే ఉన్నారు.

2. గుర్తించడమేగాక చెప్పుకున్న ప్రకారం చేస్తున్నాడా లేదా అని గమనిస్తున్నారు.

3. మనం మన మాట ప్రకారం నడుచుకోనప్పుడు అట్టి ప్రవర్తన తప్పని, దానికి కఠిన శిక్షలు ఉంటాయని తెలుపుచున్నారు. సత్యం, ధర్మం తప్పవద్దనేదే కదా శ్రీ స్వామివారే గాక సర్వమతాలు, సర్వశాస్త్రాలు చెపుతున్నవి. సత్యాన్ని తప్పకుండా శ్రీ స్వామివారు మనలను అనుక్షణం నడిపిస్తున్నారని అర్థం. ఆ మహనీయుని నుండి అట్టి రక్షణ పొందిన వారి జన్మలు ధన్యము కదా!

**ఈ డి. నాగేశ్వరరావు (దమ్మపేట) గారు ఇంతకు ముందు తనకు జరిగిన అనుభవం ఇలా చెపుతున్నారు-**

**నేను 17.9.01న మా పాపను తిరుపతిలో**



యం. ఎస్. సి (ఐ. ఎస్) ఎంట్రెన్స్ వ్రాయించి తీసుకొని తే18.9.01న గొలగమూడి శ్రీస్వామివారి సన్నిధికి వచ్చినాను. నేను వచ్చిన నాడు శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్నంత వరకు ద్రవాహారము, శ్రీస్వామివారి ప్రసాదము తప్ప మరేదియు తినకూడదు అని అనుకున్నాను. తే19.9.01 వరకు సజావుగానే నియమాన్ని పాటించ గలిగినాను. కాని, తే20.9.01న మా పాప నీవు టిఫిన్ తింటేనే నేను తింటాను అని పట్టు పట్టినందున తిన్నాను. ఆరోజు రాత్రి గం. 1.45 ని. - గం. 2.00 ని. ల మధ్య శ్రీస్వామివారు స్వప్నంలో కనబడి ఎంతో దీనంగా నాతో స్వయంగా ఇలా అన్నారు -

"అంతా చెప్పేవాళ్ళేనయ్యా, ఆచరించే వాళ్ళే లేరయ్యా"-

నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. నేను ఇలా ద్రవాహారమే తీసుకుంటానని అనుకున్నది నాకు తప్ప ఎవ్వరికీ తెలియదు. అలాంటిది శ్రీ స్వామివారి దయ ఎంత గొప్పదో చూడండి. తన భక్తులను మార్గము తప్పుతున్నప్పుడు సక్రమమైన మార్గంలో పెట్టడానికి ఎంత కృషి చేస్తున్నారో అని ఈ సంఘటన ద్వారా

నాకు తెలిసింది.

అదే స్వప్నంలో- నేను వెనుకకు తిరిగి వచ్చేస్తుంటే శ్రీ స్వామివారు నా కుడికాలి పిక్క క్రింది భాగంలో గట్టిగా నొక్కినారు. ఎంతో బాధగా ఉంది. వారి స్పర్శ నా భాగ్యం. నాకు స్వప్నంలో ప్రసాదించిన కృపకు నేను ఎంతో ఋణగ్రస్తుడను. శ్రీస్వామివారి దయ, కృప, కరుణలను నేను ఏమని తెలుప గలను. శ్రీస్వామివారు వెంట ఉండి మనలను నడిపించుతారనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం.

ఆ కరుణామయుడు అనుక్షణం మన ఆలోచనలు, మాటలు, చేతలు గమనిస్తూ సత్యం, ధర్మం తప్పకుండా మనలను వెన్నంటి కాపాడుతారు. "పొయ్యేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా" - అని వారనకుండా మనం జాగ్రత్త పడాలి.

శ్రీ వై. శివరామయ్య గారు - ఉచ్చూరు గ్రామం, నెల్లూరు జిల్లా. వీరి అనుభవం-
వీరికి రెండు కిడ్నీలు చెడిపోయి చావుబ్రతుకుల్లో



ఉన్నప్పుడు శ్రీ స్వామివారి నాశ్రయించగనే - ఉప్పు లేకుండా ఒక్కపూట అన్నం తినయ్యా- అని శ్రీ స్వామి వారు స్వప్నంలో చెప్పగ ఆయన అలా చేయడంతో వారి ఆరోగ్యం చక్కబడింది. (ఈ విషయం - పిలిచిన పలికే దైవం - అనే పుస్తకంలో వ్రాశాము.)
వీరికే దాంపత్య సుఖం లేకుండ పత్యం పెట్టారు శ్రీ స్వామివారు. మానవ సహజమైన బలహీనత వలన కొన్నాళ్ళ తరువాత పత్యం తప్పాడు. మరునాడు స్వప్నంలో శ్రీస్వామివారు బెదిరించారు. మరలా కొన్ని నెలల తర్వాత తిరిగి పత్యం తప్పాడు. తిరిగి శ్రీ స్వామివారు స్వప్నంలో భయంకరంగా బెదిరించారు. మరలా మూడవసారి అదుపు తప్పి పత్యం తప్పాడు. ఈసారి ఇలా కాదని శ్రీ స్వామివారు అతని తొడమీద క్యాన్సరు బిళ్లలు పెట్టారు. ఈ బిళ్లల వలన చాలా బాధగా ఉండేది. సూళ్ళూరుపేట డాక్టరు గారు, శ్రీకాళహస్తి డాక్టరు గారు - ఇవి క్యాన్సరు బిళ్లలు, మీరు క్యాన్సరు డాక్టరును సంప్రదించండి అన్నారు. అది విని ఈ భార్యాభర్తలిద్దరు అది తాము చేసిన తప్పుకు శ్రీ స్వామివారు విధించిన శిక్ష అని గట్టిగా

విశ్వసించి శ్రీ స్వామివారి చిత్రపటము ముందు చెంపలేసుకొని, గుంజిళ్లు తీసి క్షమాపణ వేడుకొని- "ఇక మీదట ఇలాంటి తప్పు చేయము. చేస్తే మీ సేవకు పనికిరాము. మీ దగ్గర స్థానము కోల్పోతాము" - అని చెప్పుకున్నారు. పరమకరుణామూర్తి అయిన శ్రీ స్వామివారు వారిని క్షమించినందుకు నిదర్శనముగా పైసా మందు వాడకుండానే ఎలా వచ్చిన క్యాన్సరు బిళ్లలు అలాగే మాయమైనాయి. ఆ మహనీయుని దయ వలన ఈయన ఆరోగ్యము బాగుపడినది.

"వాళ్లుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది" - అన్న శ్రీస్వామివారి మాట అక్షరాల నిజమైంది. మానవ సహజమైన బలహీనతల వలన మనం తప్పుచేసినా ఆ దయామయుడు మనలను క్షమించి సన్మార్గములో పెట్టడం ఎంత గొప్ప విషయమో చూడండి. సన్మార్గములో పెట్టేందుకు వారు సామ, దాన, భేద, దండోపాయములను ఉపయోగిస్తున్నారు.

హే ప్రభూ, ఎప్పుడూ నీ రక్షణ పోకుండా ఉండే



విధంగా మేము ప్రవర్తించేటట్లు అనుగ్రహించు తండ్రీ.

టి. పద్మ- ఇస్లాంపేట, మొదటి లైను, ఒంగోలు - ఇలా చెపుతున్నారు-

జులై నెల 2001 సంవత్సరంలో మోకాళ్లపైనుండి, నడుముల వరకు భరించరాని నొప్పి. మూడు నెలలు మంచంలో ఉన్నాను. ముగ్గురు డాక్టర్ల దగ్గర వైద్యం చేయించాను. అణుమాత్రం కూడ బాధ తగ్గలేదు. 500 రూ. ఖరీదు గల ఇంజెక్షనులు 45 వేయించుకున్నాను. నడుములకు కరెంటు పెట్టారు. ఎన్నో మందులు వాడాను. ఈ భరించరాని బాధ వల్ల నాకు రాత్రింబవళ్లు నిద్రలేదు. అన్నం తినలేను. ఐదు నిద్ర మాత్రలు మ్రింగినా నిద్ర బాగారాదు. నాలుగడుగుల దూరం నడువలేను. నరక యాతన అనుభవిస్తున్నాను. నా వయస్సు ముప్పై సంవత్సరములు. ఇద్దరు పిల్లలు.

అద్దంకిలోని నా మిత్రురాలి సలహాపై గొలగమూడి రావాలని ప్రయత్నిస్తే ఇంట్లోవాళ్లు అంగీకరించలేదు.

నా బాధ చూడలేక నా భర్త నన్ను తన మోటారు సైకిలు మీద గొలగమూడి తీసుక వస్తున్నారు. మధ్యలో ఏమనుకున్నారో గాని, నన్ను రైల్వేస్టేషను వైపు తీసుకపోతున్నారు. మోటారుసైకిల్ పైనుండి దూకేశాను. నన్ను గొలగమూడి తీసుకుపోకుండా ఒంగోలు తీసుకుపోతున్నారని గ్రహించి ఆ విధంగా దూకేశాను. నా బాధలు అంత తీవ్రంగా ఉన్నాయి. దేవుని దయవల్ల నాకెలాంటి దెబ్బ తగల లేదు. ఇక లాభంలేదని నన్ను గొలగమూడి తీసుక వచ్చి వసంతవిహార్ లాడ్జిలో ఉంచారు.

పన్నెండు రోజులు ఉన్నా ఏమాత్రము తగ్గలేదు. అక్కడున్న భక్తులు నన్ను గొలగమూడిలోనే ఉండి విశ్వాసంతో స్వామిని సేవించమన్నారు. నరక యాతన వంటి నా బాధలను నే నేమని వివరించగలను. ఒకరోజు గుడిలోనే ఏడుస్తూ పడుకొని యున్నాను. నా స్వప్నంలో శ్రీస్వామివారు కనిపించి- "పాపము కొండలు కొండలుగ మూటగట్టుకొని యున్నావు. అది కరగాలి కదా! గుండము చుట్టూ తిరుగు. ఇక్కడే ఉండి సేవ



చేసికో"- అని చెప్పారు. అది మొదలు కాస్త తిరగ గలిగాను.

అటు తర్వాత స్వప్నంలో వనమూలికలు, అవి నూరే కల్వమురాయి కనిపించాయి. శ్రీస్వామివారి దగ్గరున్న వాళ్లు ఆ వనమూలికలు తినమన్నారు. అవి తినగానే నా బాధలన్నీ క్రమంగా తగ్గిపోయాయి. మామూలు మనిషి నయ్యాను. శ్రీస్వామివారు సెలవిచ్చినంత వరకు గొలగమూడి వదలి పోవద్దని ఇక్కడి భక్తులు చెపుతున్నారు. నాకు ఆరోగ్యం బాగుంది. పిల్లలు వేసవి శలవులకు ఇంటికి వస్తారని నేను ఇంటికి పోవాలని ఆరాటపడ సాగాను.

నాలుగు రోజులు ఇంటికి వెళ్లి వస్తానని శ్రీస్వామివారికి విన్నవించ సాగాను. శ్రీస్వామివారు స్వప్నంలో కనిపించి అలాగే వెళ్లి ఐదవరోజు వచ్చివేయ మన్నారు.
నేను ఇంటికి వెళ్లి పదిరోజులైనా తిరిగి రాలేదు. శ్రీ స్వామివారు ఒంగోలులో నాకు స్వప్నదర్శనమిచ్చి- "నీవు చెప్పినట్లు గొలగమూడి వస్తావా లేక మరలా

తాఖీదులు పంపమంటావా?" (తాఖీదులు అంటే బాధలని అర్థం) -అని బెదిరిస్తున్నారు. తెల్లవారే గొలగమూడికి వచ్చి నలభైరోజులు ఉండి పోయాను. అది మొదలు వీలున్నప్పుడల్లా వచ్చి శ్రీస్వామివారిని సేవిస్తుంటాను.

మనం ఆశావ్యామోహాలకు గురై శ్రీస్వామివారికిచ్చిన మాట తప్పిపోయినా ఆ కరుణామయుడు స్వప్నాల ద్వారా బెదిరించి అయినా మనలను సత్యమార్గంలో నడిపించుచున్నారు. ఎన్ని జన్మలకైనా నేను వారి ఋణం తీర్చుకోలేను.

ఈ లీల ద్వారా మనకొక గొప్ప రహస్యం వెల్లడి చేస్తున్నారు. కొండలు కొండలుగ ఉన్న ఆమె పాపకర్మను తన యోగశక్తితో ఆపి ఆమెకు బాధ నివారణ చేశారు. ఆరోగ్యము కలిగిన తర్వాత సమాధి మందిర ప్రదక్షిణలు, మందిరంలో సేవా కార్యక్రమాల ద్వారా మరి కొన్నాళ్ళు శ్రీ స్వామివారిని సేవించి తన పాపకర్మ పరిహారం చేసికోవాలని శ్రీస్వామివారి భావం. అది గుర్తించక మనం మన కష్టం



తొలిగిందికదా ఇక ఏముందని శ్రీస్వామివారిని అశ్రద్ధ చేస్తాము. అందుకే శ్రీస్వామివారు ఒంగోలులో ఆమెకు స్వప్నదర్శనమిచ్చి "గొలగమూడి వచ్చి సేవ చేసుకుంటావా? లేక తాఖీదులు పంపమంటావా?" అని నిలదీశారు. ఇది ఆమెకే కాదు. మనందరికీ గొప్ప పాఠమే-

1. కర్మ క్షాళనకు శ్రీస్వామివారు సెలవిచ్చినంత వరకు గొలగమూడిలోనే ఉండి సేవించడము,
2. కృతజ్ఞతా భావంతో కనీసం నెలకొక సారైనా శ్రీస్వామివారి సమాధిని దర్శించడం,

అత్యవసరమని తెలుస్తుంది.

బత్తిక రమాదేవి - 31 చేద్‌పేట, వైద్యనాధ వీధి, మద్రాసు - ఇలా చెపుతుంది-
1996 వ సంవత్సరంలో నిష్కారణంగా నా కుడిచేయి పడిపోయి స్పర్శలేకుండా పోయింది. పదివేల రూపాయలకు పైన ఖర్చు చేసి డాక్టర్ల చుట్టూ తిరిగి అనేక పరీక్షలు చేయించుకొని, మందులు వాడినా ఏమీ గుణం కనిపించలేదు. పవిటచెంగు కూడా కుడిచేత్తో కప్పుకో లేకుండా ఉన్నాను. అన్నం తినాలన్నా ఆ

చేత్తో తినలేను. తలముడి వేసుకోలేను. కొన్ని నెలలు ఇలా బాధ పడ్డాక నేను నిత్యం పూజించే కనకదుర్గను నా బాధ తొలగించమని ప్రార్థించ సాగాను. ఒక రోజు ఆ తల్లి స్వప్నదర్శనమిచ్చి - "నీవు గొలగమూడికి వెళ్ళు, ఆయన బాగు చేస్తారు. నేను ఆయనకు జాబు వ్రాశాను" - అని ఆదేశించింది. శ్రీ స్వామివారి దయ వలన గొలగమూడికి మార్గం తెలుసుకొని బస్టాండుకు వచ్చి కూర్చుంటే నాకు తెలిసిన వాళ్ళు గొలగమూడికి పోతున్నారు. వాళ్ళతోటి క్షేమంగా గొలగమూడి వచ్చాను. గొలగమూడిలో స్వప్నంలో శ్రీ స్వామివారు కనిపించి - "నీ చేతికి ఏమైంది, ఏమీ కాలేదు. ఆ తాటిమట్ట ఆ చేత్తోనే విదిలించి అట్లా వెయ్యి" - అన్నారు. నేను అలాగే వేశాను. "ఎక్కడెక్కడి పీడను ఆ చేత్తో తుడిచావు. అందువల్ల అలా అయింది. ఇంకేమీ లేదు పో" - అన్నారు. తెల్లవారినప్పటి నుండి నా చేతి పరిస్థితిలో చాల మార్పు వచ్చింది. పమిటచెంగును కుడిచేత్తో సర్దుకుంటున్నాను. చిన్న చిన్న వస్తువులను ఆ చేత్తో తీసికో గలిగినాను. మరుసటి వారం మరలా గొలగ మూడి వచ్చాను. మరలాకూడా శ్రీ



స్వామివారు దర్శనమిచ్చి- "చేతిలో ఏమీ లేదు. అంతా బాగున్నది. నీవు అంతా వేషాలు పడుతున్నావు. బాగుంది పో"- అన్నారు. అది మొదలు నా చెయ్యి బాగైపోయింది. అన్ని పనులు చక్కగా చేసుకొంటున్నాను. శ్రీ స్వామివారికి నా శక్తి కొద్ది బియ్యం, విస్తరాకులు, ఊరగాయ సమర్పించాను.

నా అజ్ఞానం వలన మూడు సంవత్సరాలు నేను శ్రీస్వామివారి దర్శనానికి రాలేదు. ఈలోగా నాకు రెండు మార్లు గుండె పోటు వచ్చి బాగైంది. ఎంతో ఖర్చయింది. శ్రీ స్వామివారు పరమదయామూర్తి గనుక- "నా మాటే మర్చిపోయావే. గొలగమూడి రావేమి? ఊబిలో కూరుక పోతున్నావు." - అని స్వప్నాదేశ మివ్వడంతో మరలా గొలగమూడి వచ్చాను. ఈ లీలను శ్రీ పెసల సుబ్బరామయ్య గారికి చెప్పాలని శ్రీ స్వామివారి అభీష్టం కాబోలు, నాటి రాత్రి స్వప్నంలో సుబ్బరామయ్య గారు నాకు శ్రీ స్వామివారి ఫోటోలపుస్తకం చూపిస్తూ ఆశ్రమంలోని వివిధ స్థలాలు చూపిస్తున్నారు. తెల్లవారిన తర్వాత ప్రయాణం మానుకుని శ్రీ

సుబ్బరామయ్యగారిని చూచిన తర్వాతనే మద్రాసు పోవాలని ఉండిపోయి వారికి ఈ దివ్యలీల చెప్పాను.

ఇందులో ముఖ్యంగా మనం గమనించవలసినవి రెండు అంశాలు ఉన్నవి-

1. ఇష్టదేవత కూడా చేయలేని పని శ్రీ స్వామివారు చేయగలగడం,

2. మనం అజ్ఞానం వలన, కృతజ్ఞతతో శ్రీ స్వామివారి దర్శనార్థం రానప్పుడు ఆ కరుణామయుడే మనలను చీవాట్లు పెట్టి తన చెంతకు పిలుచుకోవడం -

అనే విషయాలు చాలా గొప్పగా గమనించదగినవి.

యన్. చక్రధరరావు- కుక్కునూర్, ఖమ్మం జిల్లా- ఇలా వ్రాస్తున్నారు-

శ్రీ పెసల సుబ్బరామయ్య గారికి,

నారాయణమూర్తి నమస్కారములు తెలుపుచు వ్రాయునది- మేము అనగా నేను, నా భార్య, మా చిన్నపాప ఒక ఆదివారం నాడు దోమల నివారణ కొరకు టార్టాయిస్ చక్రం లాంటిది వెలిగించి మంచం ప్రక్కన కిటికీలో పెట్టి పడుకున్నాము. ఒక రాత్రి వేళ



మా పాప గుక్కపట్టి ఏడ్చుచున్నది. నేను నిద్ర లేచి చూచే సరికి గది అంతా దట్టంగా పొగ కమ్ముకొని ఉన్నది. ఏమి జరుగుతున్నదో 5ని.లు నాకు అర్థం కాలేదు. వెంటనే లేచి పాపను యింకొక గదిలోకి తీసుకెళ్లి అక్కడ కూర్చొబెట్టి, నాభార్యను లేపి చూస్తే మేము కప్పుకొన్న షోలాపూర్ దుప్పటి 7,8 చోట్ల కాలివున్నది. క్రింద బొంత కాలింది. నవారు కూడ కొంత కాలింది. పైన ఫ్యాను తిరుగుతూ వుంది. కిటికీ రెక్కలు మూసి ఉన్నవి. ఏమాత్రం మంట రేగినా మేము బయట పడలేము. ఇన్ని కాలినా మా వంటికి గాని మేము ధరించిన బట్టలు గాని కొంచెం కూడ కాలలేదు. నేను ఆరాధనకు తే 23.8.01 న గొలగమూడి వచ్చాను. ఆ రోజు రాత్రి సాయిమాష్టర్ నిలయంపై నేను నిద్రిస్తుండగా ఒక కల వచ్చింది. ఆ కలలో మా ఇంటి దగ్గర గడ్డివాములు, ఇండ్లు, కాలిపోతున్నాయి. నేను చుట్టుప్రక్కల వారిని అందరిని లేపి నీళ్ళు తెమ్మని హడావుడి చేస్తూ ఇంటిపై చల్లుతూ ఆర్పివేశాము. అవి ఆరిన తర్వాత - "వీటిని ఆర్పి నిన్ను రక్షించిన దెవరు?" అని-శ్రీస్వామివారు నన్ను అడుగుతున్నారు. ఇంతలో

నాకు మెలకువ వచ్చింది. మొన్న కుక్కనూరులో జరిగిన సంఘటన గురించే యిలా తెలియజేసి, నిన్ను రక్షించింది నేనే- అని శ్రీస్వామివారు నాకు తెలిపారు. ఇందులకు నేను శ్రీ స్వామివారిని రక్షించమని కోరకున్నా నా వెంటవుండి నన్ను నడిపిస్తున్నందులకు భగవాన్ శ్రీశ్రీవెంకయ్య స్వామివారి పాదపద్మములకు హృదయపూర్వకముగ నమస్కరించుచున్నాను.

మనం ఏమారి ఉన్న సమయాలలో కూడ మన ప్రార్ధనతో నిమిత్తం లేకుండానే శ్రీస్వామివారు మనలను రక్షిస్తారు. ఇది బాగా తెలిసికొని శ్రీస్వామివారు చెప్పినట్లు జీవించడం నేర్చుకోమని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.

తోకల సీత గారు- తిరుమలకుంటగ్రామం, అశ్వారావు పేట మండలం, 507301- వారి అనుభవాన్ని ఇలా వ్రాస్తున్నారు-

ఈమధ్య మాయింట్లో ఒక ఫంక్షన్ జరిగింది. అప్పుడు నేను నల్లపూసల గొలుసు, వాచీ, ఉంగరం



పెట్టుకున్నాను. తరువాత అవి తీసి డ్రాయరు సొరుగులో వేశాను. నాల్గురోజుల తర్వాత చూస్తే ఉంగరం, వాచీ ఉన్నాయి కాని నల్లపూసలగొలుసు మాత్రం లేదు. అందరూ వెళ్ళిపోయారు. నాకు ఏమీ తోచక మా అమ్మగారి ఊరు దమ్మపేటకు వచ్చాను. ఒక రోజు దమ్మపేట సత్సంగ సభ్యురాలు లక్ష్మిగారితో చెప్పుకున్నాను. స్వామి సర్వసమర్థులు. అందుచేత నీవు 7 పారాయణలు - గురుచరిత్ర, శ్రీవెంకయ్య స్వామి చరిత్రలు- పారాయణం చేయమని, వారానికి రు.20లు చొప్పున దక్షిణ పెట్టమని చెప్పినారు. నేను ఉదయం టిఫిను తినటం మానేసి భోజనం మాత్రమే చేస్తూ ఏడు వారాలు ఏకాగ్రతగా పారాయణము చేశాను. 7 వారాలలో నా వస్తువు నాకు ఇప్పించమని స్వామిని ప్రార్థించాను. ఆరు వారాలు అయ్యే సరికి సర్వాన్ని ప్రేరేపించే స్వామి నా వస్తువు నాకు అందజే శారు. బీరువలో ఉన్న చీర మడతలో దొరికింది. నాకు ఎంతో ఆనందం కలిగింది. ఎందుకంటే ఎప్పుడూ అనుకునే దానిని - శ్రీస్వామివారు అందరికి అనుభవం ఇచ్చారు, నాకు ఏ అనుభవం కలుగలేదు అని. అనుకున్నందుకు నాకు

కూడ శ్రీస్వామివారు ఈ అనుభవాన్ని కలిగించారు. నాకు ఎప్పుడూ శ్రీస్వామివారి ఆశీస్సులు వుండాలని కోరుచున్నాను.

వి. బి. ఆర్ శర్మగారు, వై. పి. సి., విజయవాడ - ఇలా వివరిస్తున్నారు.

శ్రీస్వామివారు మమ్ములను అనేక ఆపదలనుండి కాపాడి యున్నారు. అందువలననే శ్రీస్వామివారి సమాధిని దర్శిస్తుంటాము. మా అమ్మాయి హాల్‌టికెట్ వచ్చింది. దాన్ని శ్రీస్వామివారి సమాధికి తాకించి వారి ఆశీస్సులుపొందాలని, అమ్మాయికి శ్రీస్వామివారి సమాధి దర్శనం చేయించాలని తే 21.3.01 న విజయవాడ నుండి మా అమ్మాయిని తీసుక వస్తున్నాను. క్రిష్ణాఎక్స్‌ప్రెస్ ఎక్కాలని రైల్వే ప్లాట్‌ఫారం మీద ఉన్నాము. ఆ రైలు నిలిచింది. నేను కమ్మి పట్టుకొని ఎక్కబోయాను. కాలు జారి కమ్మిపట్టు తప్పింది. వెనుకనుండి జనం విపరీతంగా తోశారు. నేను రైలుకు ప్లాట్‌ఫారంకు మధ్య గల సందులో పడిపోయాను. జనం నన్ను



లెక్కచేయకుండా రైలెక్కేశారు. రైలు కదిలి పోయింది. మనిషి చనిపోయాడని అందరూ కేకలు పెట్టి గోలచేస్తే ఆగింది. గార్డు, డ్రైవరు అందరూ వచ్చి నన్ను లేవదీశారు. నాకు చెయ్యిగూడ తొలిగిపోయింది. వెన్నుపాము ఎలా వెళ్ళిందో పిడికిలి పట్టేటంత రంధ్రం పడింది. ఆస్పత్రికి చేర్చారు. గూడ పాటుకు తోసి పిండికట్టు కట్టారు. రియాక్షన్ వల్ల చీము కారుతూ వెన్నుపాము రంధ్రము అరచేతి వెడల్పున కురుపయింది. దుర్గంధమైన వాసన. అది కూడ మానింది. వెన్నుపూస క్రింద గుంట ఎలా లేకుండా పోయిందో తెలియదు. వెనుక వీపును గీచుకొని చిన్న గాయం అయింది. అదీ మానింది.

నేను క్రిష్ణాఎక్స్‌ప్రెస్ క్రింద పడి తిరిగి బ్రతుకుతానని ఎవ్వరూ ఊహించ లేదు. రైలుకు ప్లాట్‌ఫారం మధ్య పడడం మాత్రం తెలుసు. ఆ తర్వాత నాకేమైంది తెలియదు. తర్వాత రైలు ఆపి డ్రైవరు, గార్డు వచ్చి లేవదీస్తే స్పృహ వచ్చింది. డిశ్చార్జి అయ్యాక ఎంత ప్రయత్నించినా గొలగమూడి రాలేక చివరకు ఒక నెల తరువాత ఏప్రియల్ 21 న శ్రీ వెంకయ్యస్వామివారి దర్శనానికి రాగలిగాను. నేను ఎలా బ్రతికి బయట

పడ్డానో ఆ ఏడు నిమిషాలు ఏమైనానో నాకు తెలియదు. అలా శ్రీస్వామివారు ప్రసాదించిన శేషజీవితము వారి సేవకే అంకితమిచ్చేట్టు చేయమని శ్రీస్వామివారిని ప్రార్థిస్తున్నాను.

ఈయన రైలుకు ప్లాట్‌ఫారంకు మధ్య పడేటప్పుడు శ్రీస్వామివారిని ప్రార్థించాడా- లేనేలేదు. అంటే మనం ప్రార్థించని సమయాలలో కూడ శ్రీస్వామివారు మనలను కంటికి రెప్పవలె కాపాడుతుంటారు. కనుక మనం వారు చెప్పినదాన్ని ఎంత జాగ్రత్తగ ఆచరించాలో ఆలోచించుకోవాలి. "అన్ని జీవులలోను వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోయ్యా"- "వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది". ఇవి మనం చక్కగ యోచించి ఆచరిస్తే ఇక మనకు ఏ కొదువ ఉండదు.

1980 సంవత్సరం వరకు గొలగమూడిలో కాపురమున్న పుల్లారెడ్డి గారు శ్రీస్వామివారిని గురించి చెప్పిన రెండు ఆసక్తికరమైన విషయాలు-

1. నేను గొలగమూడిలో నివసించేటప్పుడు నాకు 15- 16 సం. ల వయస్సు ఉంటుంది. అప్పుడు మేము ఆటలాడే పిల్లలమే. ఇప్పటిలాగ బడి బద్ధలు



లేవు. కనుక 16 సం. ల వయస్సులో కూడ రాత్రి వెన్నెలలో చెడుగుడు ఆడేవాళ్ళము. పగలు, సాయంకాలం వేళలలో కూడా ఆటలే. శ్రీస్వామివారు తన త్రోవన తాను పోతున్నా మా కొంటె పిల్లలముతా వారిని తరుముకొని వారిపై రాళ్ళు విసిరే వాళ్ళము. ఎందుకంటే మా దృష్టిలో ఆయనొక పిచ్చివాడు. అందుకు తగినట్టు ఎక్కువ మంది వారిని పిచ్చెంకయ్య అనే వారు. వెంకయ్యస్వామి అనే వాళ్ళు చాలా తక్కువ మందే ఉండేవారు.

మేము రాళ్ళు వారిపై విసిరితే అవి వారికి ఒక్కొక్క సారి తగిలేవి. ఆ మహనీయుడు వెనక్కు తిరిగి చూచే వారే కాని మమ్ములను ఒక్కమాట అనే వారు కారు.

వారికి బాగా ఆకలైనప్పుడు భగవంతుడు చూపిన ఇంటికి వెళ్ళి నిలబడే వారు. ఈ పిచ్చాయన అన్నానికే వస్తారని ఎరిగిన ఆ గృహస్థులు వరి అన్నమో, సంకటో వారికి ఉన్నదాన్ని వారి దోసిట్లో వేస్తే వారా ఆహారాన్ని రెండు సగాలు చేసి రెండు చేతులతో అటు సగం, ఇటు సగం బారెడు దూరంలో

పారేసే వారు. మరలా అలాగే దోసిట్లో వేస్తే అది మాత్రం అక్కడే తినే వారు. మరలా పెడితే దాన్ని రెండు సగాలు చేసి కుడి చేతిలోని సగం తిని ఎడమచేతిలోని సగం భూదేవికి అర్పించి నీళ్ళు త్రాగి వెళ్ళేవారు. ఆ మహనీయుడు భూతబలికి భూదేవికి సమర్పిస్తున్నారని ఎవరికి తెలుసు? అది ఆ పిచ్చివాని పద్ధతి అనుకునే వారు.

"మాకేదైనా బోధించండి స్వామీ" అంటే - "చూచి నేర్చు కోండయ్యా" - అన్నారు. వారిని చూచి ఆహారం భూతబలికి సమర్పించడం నేర్చుకున్నా మనం కొంత నేర్చుకున్న వాళ్ళము అవుతాము. గొలగమూడి ఆశ్రమంలో మొదట శ్రీ బరిగెల నాగయ్యగారు సమాధి మందిరం ముందు కట్టెల పొయ్యి పెట్టి నిత్యం ఒక అర కిలో బియ్యం, బెల్లం పొంగలి తయారు చేసి శ్రీస్వామివారి సమాధికి నివేదించి కొంత అగ్నిహోత్రానికి సమర్పించి ఎవరైనా భక్తులుంటే వారికి కొంత ప్రసాదం పెట్టి మిగిలినదంతా భూతబలికి సమర్పించే వారు. క్రమంగా భక్తులు ఎక్కువగ రాసాగిన తరువాత ఏడు కిలోల బియ్యం,



బెల్లంపొంగలి చేస్తున్నారు. ఇందులో ఒక కిలో బియ్యం, బెల్లం పొంగలి భూతబలికి, ఒక అరకిలో పొంగలి అగ్నిహోత్రానికి నిత్యం సమర్పించు చున్నారు. ఈ సంప్రదాయానికి మూలపురుషుడు శ్రీ బరిగెల నాగయ్య గారేనని చెప్పక తప్పదు.

2. శ్రీపుల్లారెడ్డిగారు చెప్పిన తన కుమారుని ఉదంతం-

నాకు నాలుగు సంవత్సరముల కుమారుడుండేవాడు. అతనిని మా ఇంటి ప్రక్కనున్న పిల్లలులేని మునసబు గారు చాలా గారాబంగా దగ్గరతీసే వాడు. అనికేపల్లికి గొలగమూడికి ఒకే వెట్టివాడు, ఒకే మునసబు. ఒక రోజు నా కుమారుడు ఆటకాయతనంగా మా బర్రెల వెంబడి పరుగెత్త సాగాడు. వాడు పోవడం ఎవ్వరూ చూడలేదు. ఈ బర్రెలు ఆ సమీపంలోని సర్వేపల్లి చెరువులో నీళ్ళు త్రాగుతుంటే వీడు ఒక బర్రె తోక పట్టు కున్నాడు. ఆ బర్రె నీళ్ళలో ఈదసాగింది. వీడు అదొక ఆటగా ఉత్సాహంగా, ధైర్యంగా దానితోక వదలకుండా పట్టుకొని దానితోటి నీళ్ళలో చాలా

దూరం పోయాడు. అది చివరకు గట్టెక్కింది. కానీ అప్పటికే అది దిగిన చోటి నుండి రెండు మైళ్ళు వెళ్ళి పోయింది. అక్కడ వీడు దాని తోక వదిలేసి అటు ఇటు కొంత దూరం తిరిగి అలసిపోయి విడవలి పొదల్లో కూర్చుని ఏడుస్తున్నాడు. ఏడ్చి ఏడ్చి, మే నెల ఎండలకు గొంతెండి పోయింది. దైవలీలగా పేడ ఏరుకుంటూ ఒకామె ఆ ప్రాంతానికి వచ్చి ఈ బిడ్డను చూచింది. సమీపంలోని నీరు త్రాగించి వాళ్ళ ఇంటికి తీసికొని వెళ్ళింది. ఏ వూరు, ఎవరి పిల్లవాడివి అంటే సరిగ చెప్పలేక పోయాడు. ఆమెకు పిల్లలు లేరు. దేవుడే ఈ బిడ్డనిచ్చాడని ఆమె ఆ బిడ్డకు తినడానికి పెట్టింది. ఆకలి తీరగానే వాడు ఆడుకుంటున్నాడే కాని ఏడవలేదు.

ఇక్కడ గొలగమూడిలో - పుల్లారెడ్డి కుమారుడు కనిపించడం లేదని ఊర్లోని జనమంతా కలిసి ఊరంతా వెతికి చివరకు సమీపమందలి చిట్టడవిలో చెట్టుకొక మనిషి అన్నట్లు గాలిస్తున్నారు.

గ్రామ మునసబు మాత్రము గొలగమూడిలోనే ఉన్న



శ్రీ స్వామివారి దగ్గరకు వెళ్ళి - పుల్లయ్య కొడుకు 4 సం. ల పిల్లవాడు తప్పించుకు పోయాడు. ఊరి జనమంతా అడవిలో వెదుకుతున్నారు స్వామీ - అన్నాడు.

పరమ కారుణ్యమూర్తి, త్రికాలవేత్త అయిన శ్రీస్వామి వారు- "అయ్యో, ఎవ్వరూ వెతక వద్దు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన పూలరథం మీద వస్తాడులేయ్యా"- అన్నారు. ఆ మాటల అర్థం మునసబు గారికి రెండు విధాలుగ తోచి చింతపడ్డాడు.

ఈ పిల్లవాడు ఆడుకుంటుంటే ఆ గ్రామ వెట్టిఅతను అక్కడికి పోగానే ఈ పిల్లవాడు వెట్టివానిని మునసబు గారింట్లో బాగా చూచి ఉన్నందున వెట్టివానిని కరుచుకొని అతని భుజాల పైన కూర్చున్నాడు. ఈ బిడ్డ గొలగమూడిలో ఫలానా వాళ్ళ పిల్లవాడు అని అతను చెబుతుంటే- పూలమ్ముకునే వృత్తిగల ఆమె భర్త సైకిల్ మీద ఇంటికి వచ్చాడు. విషయం తెలిసి వెంటనే పిల్లవాణ్ణి సైకిల్ మీద వెనుకసీటులోనున్న పూలబుట్టలో కూర్చోబెట్టుకొని బుట్ట పడకుండ

జాగ్రత్తగ సైకిల్‌కి కట్టుకొని పది నిమిషాల్లో గొలగమూడికి తీసుక వచ్చాడు. అప్పుడు సమయము మధ్యాహ్నం ఒంటి గంట.

ఆ విధంగా పూలరథంపై వస్తాడన్న శ్రీస్వామివారి మాట యదార్థమైంది.

శ్రీస్వామివారు తంబుర మీటి అతీత స్థితిలోకి వెళ్ళి ప్రశ్నలు చెబుతారనే మాట ఉంది. వారు నటనా సామ్రాట్. వచ్చిన వారి భావాన్ననుసరించి నడుచుకునే వారు. పై సంఘటనలో వారు తంబుర లేకుండానే స్పష్టంగా మధ్యాహ్నం ఒంటి గంటకు పూల పల్లకిలో వస్తాడని చెప్పారు. అలాగే జరిగింది. దీనిని బట్టి భవిష్యత్తును ఎంత స్పష్టంగా చెప్పేవారో తెలుస్తుంది. వారిని తగువిధంగా ఆశ్రయించి సేవించ గలిగితే మనకెటువంటి చింత ఉండదని తెలియ జేస్తున్నారు.

శ్రీస్వామివారి అగ్నిగుండమునకు కట్టెలు తోలే పుల్లారెడ్డి గారు ఇలా చెప్తున్నారు-



ఒక వర్షాకాలములో గొలగమూడి గ్రామమునందు స్వామి వేంచేసి యున్నారు. అగ్నిగుండమునకు అవసరమైన కట్టెలు తోలుటకు స్వామి సేవకుడైన మల్లిక వెంకయ్య నా దగ్గరకు వచ్చి తిక్కవరప్పాడు అడవి యందు ఒక పెద్ద మ్రాను కొట్టి వున్నది. దానిని తోలుకొని వచ్చుటకు బండి కట్టమని అడిగాడు. నేల చాలా బురదగ వుండి బండి చక్రముల పూటీల వరకు దిగబడి పోతుంది. ఇప్పుడసలు వీలేకాదని నేను చెప్పినాను. అందుకు మల్లిక వెంకయ్య -"నీవేందయ్యా తోలుకొచ్చేది, నీ కెందుకు నీవు బండి కట్టు, స్వామే తోలుకొని వస్తాడు. నా మాట విని నీవు తొందరగ బండి కట్టు"- అన్నాడు. నేను ఇది జరిగేది కాదని అనుకుంటూనే బండి కట్టి తిక్కవరప్పాడు అడవికి బండి తోలుకొని వెళ్ళాను. నాతో మల్లిక వెంకయ్య కూడ వచ్చాడు.

అది ఒక పెద్ద జువ్వి మ్రాను. అసలే బురదనేల. పైగా ఇంత పెద్దమ్రాను బండి లాగలేదని నిర్ఘాంత పోయాను. బండికి క్రింది వైపు మ్రాను వచ్చేటట్లుగ

మోకులతో కట్టాము. బండికి ఎద్దులు కట్టి తోలడం ప్రారంభించాను. ఎక్కుడు అయినా అతి సునాయాసంగా బండి దొర్లి పోవడం నన్నాశ్చర్యంలో ముంచింది. బండి వెనకాల మల్లిక వెంకయ్య వస్తున్నాడు. ఆయన - "పుల్లారెడ్డీ, బండి ముందు ఎవరు పోతున్నారో చూడు"- అన్నాడు. నేను బండి ముందు చూస్తే ఎవరూ లేరు. అది రాత్రి సమయమైనా వెన్నెల కాలం కనుక స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ఎవ్వరూ లేరు వెంకయ్యా అన్నాను. మళ్ళీ చూడు పుల్లారెడ్డీ అన్నాడు వెంకయ్య. చూస్తే అద్భుత మైన దృశ్యం కనిపించింది. బండికి కొంత ముందు భాగంలో శ్రీస్వామివారు తెల్లటి గుఱ్ఱం మీద కూర్చొని పోతూవున్నారు. శ్రీస్వామివారికి తలగుడ్డ చుట్టబడి వున్నది. గుఱ్ఱపు జీనుకు నా బండి నొగకు ఒక మోకు కట్టబడి వున్నది. ఆ దృశ్యము కొంచెం సేపు మాత్రమే నాకు కన్పించింది. "మనమేందయ్యా బండి తోలేది?- స్వామే తోలుకొని వస్తాడు" - అనిన మల్లిక వెంకయ్య మాటలోని అర్థం ప్రత్యక్షంగా బోధ పడింది. శ్రీస్వామి వారి మాహాత్మ్యమూ తెలిసింది. శ్రీస్వామివారు బండి బాడుగకు ఇచ్చే డబ్బుని కట్నం



అనేవారు. ఎంత ఎక్కువ దూరమైనా, ఎంత తక్కువ దూరమైనా రెండు రూపాయలే కట్నము. శ్రీస్వామివారు ఎప్పుడూ ఉచితముగా కట్టెలు తోలనిచ్చేవారు కారు. బండి కట్నము ఇవ్వాల్సిందే, మేము తీసికోవాల్సిందే.

కె.యల్. తులశమ్మ గారు - రిటైర్డు టీచరు, మోరిస్ పేట, తెనాలి- ఈ విధంగా తెలుపుచున్నారు.

నేను ఈ సంఘటన జరిగే ముందు గొలగమూడి రెండు సార్లు దర్శించి ఉంటాను. మా ఊరిలో శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధన మొదలు పెట్టిన సంవత్సరం అది. (సంవత్సరం నాకు సరిగ గుర్తు లేదు.) ఆరాధనకు ముందు వారం, పది రోజులు నాకు నడుం పట్టుకు పోయి అన్నీ మంచం మీదనే జరుగుతున్నవి. అటు ఇటు పొర్లటానికే చాల కష్టంగా ఉండేది. నేను హాస్పిటల్‌కు వెళ్ళను. మందులు తీసికోను. ఈ దేహం ఒక అద్దె ఇల్లు. దీనిలో ఉన్నందుకు కొంత అద్దె చెల్లించాలి. ఆ అద్దే ఈ జబ్బులు అని నేనూహించి వైద్యం చేయించుకోకుండా

ఉన్నాను. అంతలో ఆరాధనకు రండి అంటూ కార్యకర్తలు నన్ను ఆహ్వానించటానికి వచ్చారు. నేను కదలలేని పరిస్థితిలో ఉన్నాను. ఎలా వచ్చేదయ్యా అన్నాను. ఆ రోజుకు నడుం నొప్పి తగ్గితే ఆరాధనకు నడిచి వస్తాను అని చెప్పాను. అక్కడ కూడ ఆరాధన ఆగష్టు 24వ తేదీననే జరుగుతుంది. సరిగ్గా ఆ రోజుకు నడుం నొప్పి పూర్తిగా తగ్గి పోయింది. కాని యింటి నిండా చుట్టాలున్నారు. మా తోడికోడలి మనవరాలికి జబ్బుగా ఉంటే గుంటూరు తీసుకు వెళ్ళడానికి వాళ్ళు వచ్చి యున్నారు. నా కోడలికి ఒంట్లో బాగలేకపోతే మా కొడుకు, కోడలు వచ్చియున్నారు. మా అత్తయ్య చెల్లెలు ఉన్నారు. ప్రొద్దున ఆరాధనకు వెళ్ళడానికి కుదర లేదు.

సాయంత్రం మా చిన్నఅత్తయ్యను పిలిచి ఎవరికి చెప్పకుండా త్వరగా ఆరాధనకు వెళ్లి వద్దామని ఆమె, నేను కలిసి బజారులో కొబ్బరికాయ, అగరొత్తులు, కర్పూరం, కొనుక్కొని ఆరాధనకు వెళ్ళాము. అక్కడ కొబ్బరికాయ కొట్టడానికి ఇచ్చాను. నాకు ఆశ్చర్యం కలిగే సంఘటన కనిపించింది. కొబ్బరికాయకు పసుపు పచ్చని దారం చుట్టి యున్నది. పూజారి



నడిగి టెంకాయ తీసుకొని ఆ దారం ఎక్కడిదా అని చూచాను. అప్పుడే పసుపురాసి చుట్టినట్లు తడిగా ఉన్నది. అంగట్లో కొని తెచ్చి నప్పుడు లేదే ఇదేమి చిత్రం అనుకొని దారం తీసి నా పర్సులో వేసికొని తీర్థం, ప్రసాదం తీసికొని ఇంటికి రాబోతూఉంటే - " రిక్షా మాట్లడుతాము, ఉండండి టీచరుగారు " అని కార్యకర్తలు అంటున్నారు. "భలే వారేనయ్యా, నేను నడిచి వస్తా నన్నాను కదా నడుం నొప్పి తగ్గింది, నడిచి వచ్చాను, నడిచే వెళ్ళుతాను అన్నాను ". పట్టుదల అంటే ఇలా ఉండాలి అని అక్కడి వాళ్ళు అనుకున్నారు.

నేను ఇంటికి వచ్చి కొబ్బరికాయకు చుట్టబడిన దారాన్ని అనారోగ్యంగా ఉన్న మా తోడికోడలి మనవరాలికి, మా కోడలికి కట్టాను. తెల్లవారే సరికి వారి ఇద్దరికి స్వస్థత చేకూరి ఎవరి ఇండ్లకు వారు వెళ్ళారు. శ్రీ వెంకయ్యస్వామివారి మీద విశ్వాసం ఉంచాలే గాని వారికే కాదు, వారిబంధువులను కూడ కాపాడుతారు.

శ్రీవెంకయ్యస్వామివారిని గూర్చి నాకు తెలిపినవారు శ్రీ భరద్వాజ మాస్టరు గారు. ఆయన్ని జీవించి ఉండగ చూడలేక పోయాను. కాని వారి భక్తుడు శ్రీ పెసల సుబ్బరామయ్యగారు వ్రాసిన "స్వామికృప" అనే పుస్తకం నాకెంతో సహకరిస్తున్నది. "స్వామికృప" అనే పుస్తకం చదవండి, 24 గంటల్లో మీకు సమాధానం లభించక పోతే నన్నడగండి అని ఘంటాపధంగా చెపుతాను.

మీరు సత్యసాయి భక్తులు కదా! మీరేమిటండీ వెంకయ్య స్వామి పుస్తకం చదవమంటారు, అంటారు కొందరు. షిరిడి సాయి, సత్యసాయి, వెంకయ్య స్వామి పేర్లు మాత్రమే వేరు. వారందరు ఒక్కటే, అని చెబుతుంటాను.

"వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది" - అన్న దానికి నిదర్శనమే పసుపుదారం ఉదంతం. ఆమెనే కాదు, ఆమె నాశ్రయించిన వారి నందరినీ రక్షస్తున్నారు శ్రీస్వామివారు. "సత్యం, ధర్మం తప్పకుండా జీవితం సాగించండి. నా అండ ఎప్పుడూ



ఉంటుంది " - అని నిరూపిస్తున్నారు శ్రీస్వామివారు.

శ్రీ గుడి సాయిబాబా గారు, గొలగమూడి- తన దివ్యానుభవాలు ఇలా చెపుతున్నారు-

2002 సం. ఏప్రియల్ నెలలో కొద్ది దూరం నడిచినా ఆయాసం, గొంతు క్రింద పట్టుకున్నట్టు నొప్పిగ ఉండి చాలా ఇబ్బంది పెట్టింది. నెల్లూరు వెళ్ళి డాక్టరుకు చూపించాను. పదివేల రూపాయల ఖర్చు. గుండెలో ఒక వైపు వాల్వులు పూడి పోయాయి. ఒక నెల మందులు వాడి రమ్మన్నారు. ఒక నెల తర్వాత నేను వెళ్ళే సరికి డాక్టరు లేరు. బొల్లినేని ఆసుపత్రికి పోయాను. వాళ్లు మరలా పరీక్షలు చేశారు. వాళ్ళు మందులు వాడ మన్నారు. నేను మొదటి నుండి శ్రీస్వామి వారికి విన్న వించుకుంటూనే ఉన్నాను. ఒకనాటి స్వప్నంలో గొంతు దగ్గర నుండి గుండె వరకు కోసి ఓపన్ చేసి ఏవో మాత్రలు తన కుడి చేతి బొటన వ్రేలితో గుండెలోకి నెట్టుతున్నారు. స్వప్నం అయిపోయింది. అది మొదలు ఆరోగ్యంగా ఉన్నాను. ఎంత స్పీడుగా నడిచినా ఆయాసం రాదు.

2002 సం. ఆగష్టు నెలలో ఎడమ ముక్కు రంధ్రం గుండా నీళ్ళు, రక్తము కార సాగింది. నెల్లూరు వెళ్ళి మందులు వాడుతూనే శ్రీవెంకయ్యస్వామివారికి విన్నవించుకుంటున్నాను. ఎడమ ముక్కు రంధ్రం ఆగిపోయి కుడి ముక్కు రంధ్రం నుండి నీళ్ళు, రక్తం కారుతుంది. మందులు వాడుతూనే ఉన్నాను. ఒక నాటి స్వప్నంలో పెద్ద గడ్డము, నడినెత్తిన వెంట్రుకల ముడి గల వ్యక్తి పేనా కత్తితో నా నడినెత్తి నుండి నుదుటి వరకు ఒక అరఅంగుళం లోతున చీల్చి నా పుఱ్ఱెను ప్రయ్యగా చీల్చారు. ఏదో ఆకు పసరు అరచేతిలోకి తీసుకొని మాడుకేసి బాగా రుద్ది "అన్ని జబ్బులు పోయాయి పో" - అని చెప్పారు. అది మొదలు ముక్కు కారడం ఆగిపోయింది. అంతేగాక గుండె విషయం కూడా ఏ బాధ లేకుండా హాయిగా ఉన్నాను.

పై రెండు సార్లు శ్రీస్వామివారు కరుణించకుంటే నేను ఎన్నో బాధలు పడవలసి ఉండేది. మన ప్రయత్నం మనం చేస్తూ శ్రీస్వామివారి కృప కొరకు ప్రార్థిస్తూ ఉంటే ఆ కరుణామయుడు ఎలా పరిష్కరిస్తారో



చూడండి.

జె. సత్యబాల - లక్ష్మీడీలక్సు వద్ద, తెనాలి - ఇలా వ్రాస్తున్నారు-

మా నాన్న గారు, యల్. నాగేశ్వరరావు గారికి బి. పి. ఎక్కువై కంటి చూపు క్రమేణా తగ్గి పోయింది. మందులు వాడినా చూపు రాలేదు. బి. పి. తగ్గడం లేదు. మా పుణ్యం కొద్దీ శ్రీవెంకయ్యస్వామివారి మహిమను గూర్చి విన్నాము. మాకు అతి దగ్గరలో కంచరపాళెంలో శ్రీస్వామివారి ఆశ్రమం ఉన్నది. అక్కడికి వెళ్ళి శ్రీస్వామివారికి విన్నవించుకొని అక్కడ నుండి నూనె తెచ్చి కంటికి పూయసాగాము. క్రమంగా కంటిచూపు చక్కగా కనబడ సాగింది. శ్రీ స్వామివారి కృప మాపై వర్షించి నందులకు మే మెంతగానో శ్రీస్వామివారికి ఋణపడి యున్నాము. వారి దయాగుణాన్ని వర్ణించడం నాకు సాధ్యం కాదు. శ్రీ స్వామివారితో మాకు గొప్పగ పరిచయము లేక పోయినా పిలిచిన వెంటనే మా మొరాలకించి మ మ్మాదుకున్న శ్రీస్వామివారిని ఏ విధంగా స్తుతించాలో తెలియదు. సత్యం, ధర్మం తప్పవద్దని తన మార్గన్ని

నిర్దేశించిన ఆ మహనీయుని మార్గంలో నడిచే శక్తి నిమ్మని ప్రార్థిస్తున్నాను.

ఆర్. బి. రాజేంద్రప్రసాద్ గారు - ఉడ్ నగర్, చీరాల - ఇలా వ్రాస్తున్నారు.

నా స్నేహితుల సలహాపై రెండుసార్లు శ్రీస్వామివారిని దర్శించాను. నా కెలాంటి సమస్యలు లేవు. నేను నిత్యము ఓం నారాయణ, ఆదినారాయణ అనే మహా మంత్రాన్ని జపిస్తుండే వాణ్ణి. శ్రీస్వామివారి పేరు మీద నిత్యం చీమలకు చక్కెర సమర్పిస్తుండే వాడిని. ఎన్నాళ్ళయినా శ్రీస్వామివారి నుండి నాకు ఎలాంటి అనుభవము లేదే అనే బాధ ఉండేది.

ఒక రోజు టి. వి. కి ఉండే రిమోట్ కంట్రోలు పనిచేయక పోవడంతో బ్యాటరీలు తొలగించి ఎండలో ఉంచాను. శ్రీస్వామివారిని స్మరిస్తూ కూర్చుని ఉన్నాను. వెంటనే ఒక ఆలోచన కలిగింది - "స్వామీ, బ్యాటరీలు లేని ఈ టి.వి. తెరపై బొమ్మ వచ్చేటట్లు చేయండి. ఈ విధంగా మీ మహిమ చూపించండి"



- అని బ్యాటరీలు లేని రిమోట్ బటన్ నొక్కాను. మరుక్షణంలో టి.వి. తెరపై బొమ్మ ప్రత్యక్షమైంది. ఇది శ్రీ స్వామివారు నా కనుగ్రహించిన అద్భుత లీల. మన హృదయగత భావాలను శ్రీస్వామివారు ప్రతిక్షణం తెలుసుకుంటూ మన విశ్వాసం అభివృద్ధి చెందేటందుకు ఎంత గొప్పగ అనుభవాలిస్తారో చూడండి. శ్రీ స్వామియే శరణం శరణం.

ఆర్. ఎ. ఎస్. శాస్త్రి గారు - ఇంగ్లీషు లెక్చరరు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి, ఆదోని - ఇలా వ్రాస్తున్నారు-

మా కుమార్తె చి. సౌ. మనస్వినికి 4 వ ఏడు నడుస్తుండగా 2000 సం. నవంబరు, 20 వ తేది రాత్రి అకస్మాత్తుగ ఊపిరి తీసుకోవడం కష్టమై డొక్కలెగరేయ మొదలు పెట్టింది. రాత్రి గం.11. 30ని.లకు చిన్నపిల్లల నర్సింగ్‌హోమ్‌కు తీసుకుని వెళ్లాము. డాక్టరు సూరదాస్ గారు రాత్రంతా చూచి తెల్లవారు ఝామున 4 గంటలకు ఈమెను కర్నూలుకు తీసుకు వెళ్ళండి అని చెప్పారు. తెల్లవారు ఝామున 5 గంటలకు బయలు దేరి ఉదయం గం. 8.30ని.లకు

కర్నూలు చేరి గౌరీ గోపాల్ హాస్పిటల్లో చేర్చినాము. న్యూరాలజిస్ట్ హరిరాధాకృష్ణ గారు, పిల్లల స్పెషలిస్ట్ గోవర్ధనరెడ్డి గారు, అన్ని పరీక్షలు ( సి. టి. స్కాన్, లంబార్ పంక్చరు) చేసి ఇది చాలా అరుదైన వైరస్ ఇన్ఫెక్షన్, అమ్మాయి స్పృహలోకి వస్తేగాని చెప్పలేము - అన్నారు. మూడు రోజులు కోమాలో ఉండి 4వ రోజు స్పృహ వచ్చింది. కానీ మెడ నిలపలేక పోతున్నది. నిలబడలేక పోతున్నది. ఇది ఎంత కాలానికి బాగవుతుందో చెప్ప లేము. వారాలు, నెలలు, సంవత్సరాలైనా పట్టవచ్చు నన్నారు డాక్టర్లు. ఈ 3 రోజులు నిరంతరము సాయి స్మరణతో, వెంకయ్యస్వామి స్మరణతోను కాలం గడిపిన మాకు ఇది తీవ్రమైన దుఃఖాన్ని కలిగించింది. శ్రీ వెంకయ్యస్వామివారికి ఆవేదనతో ప్రార్ధన చేసికొని పాపకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరితే గొలగమూడి వచ్చి మూడు నిద్రలు చేస్తాము - అని మొక్కుకున్నాము. పరమాద్భుతంగా అర్ధగంటలోనే అమ్మాయి మెడ నిలప డము, నిలబడడమేకాక వార్డంతా పరుగెత్తుతున్నది. డాక్టరు గారు వార్డుకు రౌండ్సుకు వచ్చి బెడ్డు ఖాళీగా ఉండడం చూచి



పేషెంటు ఎక్కడ అని అడిగారు. అమ్మాయి పరుగెత్తుతూ మీకు ఎదురు వచ్చిందే, చూడ లేదా అన్నాము. డాక్టరు ఆశ్చర్యపోయి ఇది దైవానుగ్రహముతో జరిగిన అద్భుతమే గాని వేరొకటి కాదనినారు. ఆ తరువాత కర్నూలులో సాయిమందిరం దర్శించు కొని క్షేమంగా ఆదోని చేరినాము. షిరిడి దర్శనం అనంతరం 2002 మే నెలలో గొలగమూడి వచ్చి అనుకొన్న ప్రకారం మూడు నిద్రలు చేసి స్వామిని దర్శించుకున్నాము. ఆ కరుణా సముద్రుని మేము సర్వదా స్మరించుకుంటూ ఉంటాము. సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ అనే పుష్పాలతో కూర్చిన పూలమాల సమర్పించి, అన్ని జీవులలోని శ్రీ స్వామివారిని సేవించి మన కృతజ్ఞత తెలుపుకొని తరిద్దాము.

nvkrao/ 21.10.02
11.15 P.M/12.11.02fp, 1.30 p.m..

శ్రీ స్వామి వారి మాటకు ఎంతలోతు ఉంటుందో, ఆ మాట ఎంత సూక్ష్మంగా ఉంటుందో తెలుసుకోవడం సామాన్యమానవులకు సాధ్యంకాదు. వారు మనకొక మాట చెప్పినప్పుడు అది అర్థంకాకుంటే దమ్మపేట- డి. నాగేశ్వరరావుగారి వలె ఆమాట యొక్క అర్థం మనకు తెలిసేటట్లు చెప్పమని శ్రీస్వామివారిని కన్నీటితో ప్రార్థించాలి. లేకుంటే రోసిరెడ్డివలె "ఓ ప్రభూ నీమాట యొక్క నిజమైన అర్థం తెలుసుకొని నీకు ప్రీతికరంగా నేను ఆచరించలేను. తమరే నాలో ప్రేరణపెట్టి మీకు ప్రీతికలిగేటట్లు నేను మీమాటను ఆచరించేటట్లు చేయండి స్వామి అని వారిని హృదయపూర్వకంగా కన్నీటితో ప్రార్థించాలి". శ్రీస్వామివారు చెప్పారు, అది అర్థంకాలేదు అని వదిలేస్తే నష్టపోయేది మనమే.

నాస్నేహితునికి శ్రీస్వామివారు - "అయ్యా! నీవు ఉండే ఇల్లు వదిలి పెడితే నీకు కష్టాలువస్తాయి" అని చెప్పారు. ఈమాట చెప్పిన కొన్ని సంవత్సరాలకు నాస్నేహితుడు ఆ ఇల్లు వదిలి కాపురం నెల్లూరు మార్చాడు. వెంటనే నాలుగువేల రూపాయలు చేసే ఎద్దు చనిపోయింది. శ్రీస్వామి వారి మాట గుర్తువచ్చి తిరిగి తన పాతింటికి కాపురం మార్చాడు. కొన్నిసంవత్సరాలు హాయిగా ఉన్నాడు. తన పూరింటి స్థానంలో మిద్దె కట్టాలని కాపురం మరొక ఇంటికి మార్చాడు. తనకు కుడిభుజంగా ఉంటూ ఇంట్లో అన్ని పనులూ చూస్తున్న మనిషి చనిపోయాడు. అదిమొదలు అతనికి కష్టాలే సంప్రాప్తమైనాయి. ఎంత కష్టమైనా సరే ఆ ఆవరణం దాటి పోకుంటే ఎంత బాగుండునోగదా!



## కన్నీటికి కరిగిపోయే స్వామి

హృదయ పూర్వకమైన ఆర్తితో కన్నీరు కారిస్తే వెన్న వంటి హృదయంగల శ్రీస్వామి వారు వెంటనే వారి బాధలు తీరుస్తున్నారు.

సూళ్ళూరుపేట సమీపానగల ఉచ్చూరు నివాసి శ్రీ వై. సివరామయ్యకు రెండు కిడ్నీలు చెడిపోయి మద్రాసు డాక్టరుకు వీలుగాక వదిలేసిన కాలంలో శ్రీస్వామివారిని ఆశ్రయించి అందరూ ప్రదక్షిణలు చేస్తుంటే అది చూచి తాను ప్రదక్షిణలు చేయలేని స్థితిలో మున్నానని కంటతడిపెట్టాడు. ఆనాటి రాత్రికే శ్రీస్వామివారు ఆయన స్వప్నంలో కనిపించి "ఉప్పు లేకుండా ఒక్క పూట తినయ్యా" అని చెప్పారు. అలాచేయగానే అతడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.

ఒంగోలు - పద్మగారు భరించరాని నడుముల నొప్పితో వచ్చి కన్నీటి ప్రార్థన చేయగానే ఆ బాధతొలగించారు. శ్రీస్వామివారు చెప్పినది తనకు అర్థంకాలేదని డి.నాగేశ్వర రావు (దమ్మపేట) కన్నీటితో ప్రార్థించగానే తిరిగి స్వప్న దర్శనమిచ్చి తాను చెప్పదల్చినది స్పష్టంగా చెప్పారు.

గొలగమూడి నివాసురాలు తన మోకాలు నొప్పి భరించలేక కన్నీటితో విన్నవిస్తే ఏ మ్రొక్కుబడి లేకుండానే ఆమెకు స్వప్నంలో ఆకు పసరు పూసి ఆనొప్పి తొలగించారు. గొలగమూడి ఎరుకలపాళెం నలబోయి సిద్దమ్మ కన్నీటికి కరగిన శ్రీస్వామివారు ఆమెకు సంతానం ప్రసాదించారు. హృదయ పూర్వకమైన ఆర్తి - విశ్వాసము మాత్రమే శ్రీస్వామివారు మననుండి కోరే దక్షిణ.

## బోధయజ్ఞాయనము:

తన దివ్య బోధనందించడం లోవారికి వారేసాటి పూజ అంటే నాకు సదభిప్రాయం లేనిరోజులవి. నిర్గుణ నిరాకారుడైన శ్రీస్వామివారు మన నైవేద్యాలు స్వీకరిస్తారా? మనతృప్తికి అలాచేస్తున్నాము అని అనుకొని యాంత్రికము, లాంఛనప్రాయమైన పూజ సాగిస్తున్న సమయం అది. హరిబాబు (గూడూరు) అనే మిత్రునికి శ్రాద్ధ కర్మలు, సాంవత్సరిక కర్మలు, తద్దినాలు, పూజలను గూర్చి నాలాగే శంకతో ఉండి శ్రీ భరద్వాజ మాష్టరుగార్ని అనేక మార్లు ఈ విషయాలు అడగాలనుకునేవాడు. కానీ వారి దగ్గరకెళ్ళినాక మరిచిపోయేవాడు. ఒకరోజు షిరిడీకి వెళ్ళి శ్రీ సివనేశన్ స్వామి వారిని దర్శించి నమస్కరించి కూర్చున్నాడట. ఇతనే మినోరువిప్పి అడగకుండానే శ్రీ సివనేశన్ స్వామివారు యధాలాపంగా చెప్పసాగారట. ఒక కోటీశ్వరునకు ఒక్కడే కొడుకు యుక్త వయస్సురాగానే ఆకొమారుడు మరణించాడు. తనకు నమ్మకం లేకున్నా కొమారుని కొరకు కర్మక్రతువులు, 40వ రోజు చేయవలసిన తంతు సాంవత్సిరిక తద్దినం



వగైరాచేస్తున్నాడు. ఒకసారి ఈతండ్రిగారి మెలుకువలో పట్టపగలే చనిపోయిన కొమారుడు కనిపించి దూరపు నగరంలోని వారి ఫ్యాక్టరీలో ఎంత డబ్బు ఎవరెవరు తిన్నది దాన్ని కప్పిపుచ్చుటకు వాళ్ళెలా తప్పుడు లెక్కలు వ్రాసింది చెప్పారట అది ఆతండ్రి పట్టించుకోలేదు. తిరిగి రెండు మూడుసార్లు మరికొన్ని చెప్పాడు. చనిపోయినవాడొచ్చి చెప్పడమేమిటి అని తోసివేశాడు.

చివరకు సాంవత్సరికంరోజు అన్ని పదార్థాలు నివేదనకు పెట్టి దండం పెట్టే సమయంలో మరలా కొమారుడు గాలిలో కనిపించి ఆపాయసంలో చక్కెర తక్కువగా వేశారు చూడమన్నాడు. చూస్తే నిజంగానే చక్కెర తక్కువగా ఉంది. "నీకిది ఎలా తెలిసింది" అని ఆతండ్రి తన కుమారుణ్ణి అడిగాడు. మేము సూక్ష్మరూపంలో వచ్చి ఆ పదార్థాలలోని సూక్ష్మాన్ని గ్రహిస్తాము అని చెప్పాడట. ఆతర్వాత ఆతండ్రి తన ఫ్యాక్టరీలలో తన కొమారుడు చెప్పినట్లు విచారించి అన్నీ నిజమేనని తెలుసుకొన్నాడు అని శ్రీసివనేశన్‌స్వామి రూపంలో హరిబాబుగారి సందేహంతీర్చడమేగాక యాంత్రికము, లాంఛనప్రాయంగా సాగించే నాపూజా విధానాన్ని సరైన మార్గానికి మార్చారన్నమాట. శ్రీ స్వామివారు ఆవిషయం హరిబాబుగారి ద్వారా నాకు చెప్పించి నన్ను సరైన మార్గానికి మార్చారు. అందుకే శ్రీమాష్టారు సిద్ధపురుషులను మాత్రమే గురువుగా సేవించి తరించమని నొక్కి నొక్కి చెప్పారు.

## మానవునికి నిరంతరము అంటుకునే పాపము

శ్రీ వెంకయ్య స్వామివారు "నీవు మనుషుల్లోకి పోయి వచ్చావు నీవు పోసే గంజి వద్దుపో" అని నిత్యము తనకు గంజి పోసే సేవను మరొకరి ద్వారా చేయించు కునేవారు. "మనుషుల్లోకి పోయివచ్చావు" అంటే బాహ్యంగా మనుషులను తాకి వచ్చాడని అర్థంకాదు. ఆ సేవకుడు ఎవ్వరినీ తాకిరాలేదు. గొలగమూడిలోని కోనేటి వద్ద గాలంవేసి చేపలుపట్టే వాళ్ళు రాజకీయ విమర్శలుచేస్తూ ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధీలను గూర్చి విమర్శిస్తుంటే ఈసేవకుడు కూడా వారి సంభాషణలో పాల్గొన్నాడు. అలా విమర్శలలో పాల్గొని ఇతరులను గూర్చి మాట్లాడడమే అతను చేసిన పాపమని శ్రీస్వామివారి భావం.

పాపమంటే ఏమిటి, పుణ్యమంటే ఏమిటి? పరపీడనం పాపం - పరోపకారం పుణ్యం అన్నారు మహనీయులు. ఈభక్తుడుగాని చేపలు పట్టేవారుగాని తమ సంభాషణలో ఇందిరాగాంధిగారిని, రాజీవ్‌గాంధీగారిని విమర్శిస్తూ వారి ఖ్యాతిపై దెబ్బ తీస్తున్నాడు అది ఇందిరాగాంధీగారికి వీరు కలుగజేసే పరపీడన మన్నమాట. అదే పాపము. ఇది ప్రతి మానవునకు వర్తిస్తుంది. నిత్యం అను క్షణంచేసే ఈపాపం నుండి మనం బయట పడనిదే శ్రీస్వామివారి బోధ మనకు హృదయగతంకాదు. గనుక



పరులను విమర్శించే దుర్గుణం పూర్తిగా మానమంటున్నారు. పరమ పవిత్రమైన శ్రీస్వామి వారి సన్నిధికి వచ్చి కూడా ఇతరులను విమర్శించడం అనే పాపం చేయడం ఎంత అపచారమో యోచించండి.

## పూజ

మనం చేసే పూజలు యాంత్రికము, లాంఛనప్రాయముగా ఉంటున్నాయి అంటారు శ్రీభరద్వాజమాష్టరుగారు. అందుచేతనే అవి వెంటనే ఫలితము చూపడంలేదంటారు. మన పూజలు యాంత్రికము లాంఛనప్రాయము కాకుండా ఎలా చేయాలో చెప్పడమే కాకుండా వారు పూజను చేసి చూపారు. శ్రీ మాష్టరుగారి దివ్య స్మృతులు అనే పుస్తకములో కొత్తూరు ప్రసాద్ అనే వారు శ్రీ మాష్టరుగారు పూజచేయడం చూచి దాన్ని వర్ణిస్తారు. ఒక్కొక్క నామాన్ని నెమ్మదిగా అనేక సార్లు చెప్పేవారట. అప్పుడు మానసికంగా వారేమి చేసేవారో అనేక చోట్ల చెప్పారు. అలాగే మనమూ చేస్తే మన పూజ యాంత్రికము, లాంఛనప్రాయము కాకుండా సజీవమైన పూజ చేయగల్గుతాము. ప్రతి నామము యొక్క అర్థం తెలుసుకొని దానికి సంబందించిన లీలలన్నీ నెమ్మదిగా మనసులో మెదలాలంటారు. గనుక ఒక నామంతోనే చాలా కాలం కదిలిపోతుంది. ఉదాహరణకు - సర్వసమర్ధ శ్రీస్వామి నాధాయనమ: అన్నప్పుడు - సర్వసమర్ధుడుగా వారు చేసిన లీలలను నెమ్మదిగా స్మరించడం. ఒక్క క్షణంలో ఒక వ్యక్తి ముగ్గురిని చంపాడు. ఆ చంపినవాడు శ్రీ స్వామివారిని శరణువేడాడు.

అతనిని రక్షించేందుకు కోర్టు రికార్డు రూములోని అతని పైలును చెదలు రూపంలో తినేశాడు శ్రీస్వామివారు. ముగ్గురుని చంపిన వాణ్ణి రక్షించవచ్చా అని మీరడుగవచ్చు. పూర్వ జన్మలో వీళ్ళు ముగ్గురు కలసి ఇతనిని చంపి ఉండవచ్చు. అది సర్వజ్ఞుడైన శ్రీస్వామి వారికి తెలుసు గనుక అలా చేశారు. ఇలాగే మరికొన్ని లీలలు సంక్షిప్తంగా స్మరించడం ప్రాణలింగస్వరూపాయనమ: అన్నాము - ప్రాణముగల వాటికి చలనం ఒక లక్షణంగా చెప్పబడింది. గనుక భూమి, గ్రహాలు, నెబ్యులాస్ అనే నక్షత్ర కూటములూ నిరంతరం చలిస్తూనే ఉన్నాయి. ఇంతేగాక ప్రతి పదార్థంలోను గల ఎలక్ట్రాన్‌లు నిరంతరము తిరిగుతూనే ఉన్నాయి. గనుక విశ్వమంతా ప్రాణమయంగా ఉంది.

స్మృతి మాత్ర ప్రసన్నాయనమ: అన్నాము. తలచిన వెంటనే ఎవరెవరికి కష్టాలు తీర్చారు. అనే లీలన్నీ మనసులో ఎంతసేపైనా మెదలవచ్చు. స్మృతి రహిత ప్రసన్నాయనమ: అన్నామనుకోండి. రోసిరెడ్డి కొమారుడు మామిడికాయల బండితో సహా కొండ మీదనుండి వాగులో పడ్డప్పుడు ఆయన శ్రీస్వామివారిని పిలువకపోయినా రక్షించారు.

కస్తూరి అంకయ్య మనవడు బావిలో పడ్డప్పుడు ఎవ్వరు శ్రీస్వామివారిని ప్రార్థించ కుండానే ఆబిడ్డను కాపాడారు. తూపిలి పిచ్చెమ్మ కొమార్తె అగ్ని గుండంలో పడ్డప్పుడు అలానే రక్షించారు. ఇలాంటి లీలలెన్నయినా మననంచేయవచ్చు.



ఇదే విధంగా ప్రతినామానికి సంబంధించిన లీలలు నెమ్మదిగా మనసులో మెదలుతూ ఉంటే అది సజీవమైన పూజ అవుతుంది. ఇది ఆచార్య భరద్వాజగారు చేసి ఆచరించి చూపిన పూజ. అలానే మనందరినీ చేసి తరించమన్నారు.

మనం పనితొందరలో అరగంటలోనే పూజ ముగించాలంటే ముగించవచ్చు. కానీ అన్ని నామాలు చదవలేదనే అసంతృప్తి ఉండనక్కరలేదు. లేదంటే చివరి ఐదు నిమిషాల్లో నామాలన్నీ చదివేయవచ్చు. చేసిన కొద్దిసేపైనా యాంత్రికము లాంఛన ప్రాయము కాని సజీవమైన పూజ చేసి వారి మహిమను తలచుకొని పులకరించ మంటారు.

## కాకబలి

శ్రీస్వామి వారు మనకు తన ఆచరణ ద్వారా బోధించిన బోధలలో ముఖ్యమైనది కాకబలి. మనంతినే ఆహారమంతా భగవంతునిచే ప్రసాదించబడిందే. ఒక బియ్యపు గింజ రావాలంటే ఎన్నిజీవులు శ్రమపడాలో ఆలోచించండి. పొలందున్నాలంటే ఇనుము కావాలి. ఇనుము గనిలోనించితీసి పొలందున్నే ట్రాక్టరు రూపం ధరించాలంటే ఎంత మంది శ్రమ చేయాలో యొచించండి. ట్రాక్టరు నడిచే ఆయిల్ కావాలంటే ఎందరు శ్రమచేయాలోగదా! అలాగే బావి, బక్కెట్టు, తాడు, మన వంటపాత్రలు,

వంటచేసే పొయ్యి, గ్యాసు, మనం నివసించే ఇల్లు వీటి నన్నింటినీ తయారు చేయాలంటే ఎన్ని జీవుల కృషి అవసరవమో చూడండి. ఎక్కడెక్కడో ఉన్న చెత్తను కృళ్ళింపజేసి ఎరువు తయారు చేయాలంటే ఎన్ని కోట్ల సూక్ష్మజీవులవసరమో! అలాగే మనం తిన్న ఆహారంలోని పిప్పిని కృళ్ళచేసి మలరూపంగా మార్చాలంటే మన పెద్ద ప్రేగులలోని అసంఖ్యాకములైన సూక్ష్మజీవుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఇలాగే పాలు, నెయ్యి, పప్పు కూరలు, మన బట్టలు ఇవన్నీ మనకు కావాలంటే ఎన్ని జీవులు కృషి చేయాలో ఆలోచించాలి ఇవి మాత్రమేకాక పంచభూతాలు నిరంతరము సహకరించాలి. పంచభూతాలంటే భూమి, సూర్యుడు, నీరు, గాలి, ఆకాశము జీవుల రూపంలోను, పంచభూతాల రూపంలోను ఆపరమాత్మే పనిచేసి మనకు ఆహారము, ఇల్లు, గుడ్డ సమకూరుస్తున్నాడు. దీనికి కృతజ్ఞతా పూర్వకంగా ఆపరమాత్మకు మనం నిండైన ప్రేమతో సమర్పించేదే కాకబలి. ఓ ప్రభూ! అసంఖ్యాకమైన జీవుల రూపంలోను, పంచభూతాల రూపంలోను అనుక్షణం కృషిచేసి నాకీ ఆహారం సమకూర్చావు. నేను తమకు సమర్పించే ఈ ఆహారం స్వీకరించి నన్ను ఋణవిముక్తుని చేయండి తండ్రీ అని మనస్ఫూర్తిగా చెప్పుకొని ప్రేమ, కృతజ్ఞతలలో సమర్పించేదే కాకబలి. మనకుంది గనుక పిడికెడు మెతుకులు బయట పడవేయడం తగదంటారు పెద్దలు కాకబలి సమర్పించడంలో హృదయం ఉప్పొంగే కృతజ్ఞతా బావం అవసరమంటారు పెద్దలు. అలా ఆచరించి చూపారు శ్రీస్వామి వారు. మనలను కూడ అలా ఆచరించి ఋణవిముక్తులు కమ్మంటున్నారు.



ముఖ్యగమనిక:- గొలగమూడిలో అనేక మంది మోసగాళ్ళు చిన్న చిన్న చిట్కాలు చేసి మీ కష్టాలు పోగొడతామని క్రొత్త వారిని మోసం చేస్తున్నారు. శ్రీస్వామి వారు తప్ప ఇతరులెవ్వరిని నమ్మవద్దని మనవి.

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు టు ది రిసీవర్ - శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమం గొలగమూడి - నెల్లూరు జిల్లా 524 312 అనే అడ్రసుకు పంపాలి వ్యక్తుల పేర్లతో పంపకూడదు.